

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం, బుధవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గిరిజన ధర్బార్)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు కెఆర్.పురం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.రాములునాయక్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఐటిడిఎ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ (గిరిజన ధర్బార్) కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికల నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చి మూడో తేదీన జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ మార్చి ఎనిమిదో తేదీన ముగుస్తుంది.



పింఛను నిరీక్షణ..!

కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం మౌనం

ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా దరఖాస్తుల స్వీకరణ లేదు

రెండు జిల్లాల్లో దాదాపు పదివేల మందికిపైగా ఎదురుచూపు

వికలాంగుల పింఛన్ల ఏరివేతపై గుట్టుగా వ్యవహారం

పెంచిన పింఛన్ల సొమ్ము గొప్పలతోనే ఊకదంపుడు ఉపన్యాసం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఎనిమిది నెలలు గడిచిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉండి పింఛను రానివారు, ఈ కాలంలో పింఛన్‌కు అర్హత పొందిన వారి సంఖ్య భారీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రూ.మూడు వేల పింఛను సొమ్ము రూ.నాలుగు వేలకు పెంపు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడంతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. అంతే తప్ప కొత్త పింఛన్ల మంజూరు గురించి మాత్రం నోరుమెదపడం లేదు. దీంతో అర్హత ఉండి పింఛన్ల రాని వృద్ధులు, వికలాంగులతోపాటు ఇతర విభాగాల వారంతా ప్రభుత్వంపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 1.86 లక్షలు, పశ్చిమలో 2.27 లక్షల పింఛను లబ్ధిదారులు ఉన్నారు. దాదాపు రెండు జిల్లాల్లో రూ.170 కోట్ల వరకూ పింఛన్ల కింద పంపిణీ చేస్తున్నారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారు రెండు జిల్లాల్లో దాదాపు పది వేల మందికిపైగా ఉన్నట్లు సమాచారం. కొన్ని సచివాలయాల పరిధిలో కొత్త పింఛన్ల కోసం వస్తున్న వారు 50 మంది వరకూ ఉంటారని తెలుస్తోంది. ఆ ప్రకారం రెండు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో పింఛన్‌కు అర్హులు ఉన్నట్లు చెప్పొచ్చు. గత ప్రభుత్వం జనవరి, జూన్‌లో ఏడాదికి రెండు విడతల్లో కొత్త పింఛన్లను మంజూరు చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలైనా కొత్తగా పింఛను ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఎంతోమంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పింఛను రాక ఆర్థికంగా నలిగిపోతున్నారు. పింఛను కోసం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. అనర్హుల పేరుతో పింఛన్ల ఏరివేతను పూర్తిచేసి తర్వాత ఆ స్థానంలో కొత్త పింఛన్లను మంజూరు చేసే అవకాశం ఉందా అన్న అనుమానాలు నెలకొన్నాయి.

గుట్టుగా పింఛన్ల ఏరివేత ప్రక్రియ

వికలాంగుల పింఛన్ల ఏరివేత ప్రక్రియ గుట్టుగా సాగిపోతోంది. ఏరివేత సమాచారం డిఆర్‌డి పీడీలు సైతం తమకు తెలీదన్నట్లు మాట్లాడుతున్నారు. అంతా ఆన్‌లైన్‌లో రాష్ట్ర కేంద్రానికి వెళ్లిపోతుందన్న మాటలు వల్లిస్తున్నారు. వాస్తవానికి జిల్లా అధికారుల పర్యవేక్షణలోనే వికలాంగుల పింఛన్ల అర్హత ప్రక్రియ కొనసాగుతోంది. వికలాంగుల పింఛన్ల ఏరివేత పూర్తయిన తర్వాత వృద్ధులు, వితంతువులు, ఇతర సామాజిక పింఛన్లకు సంబంధించి ఏరివేత ప్రక్రియ జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. కొత్త పింఛన్లు ఇవ్వాలంటే ఉన్న పింఛన్లను తగ్గించుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత తప్పదని చెప్పొచ్చు. జనాల నుంచి వ్యతిరేకత రాకుండా పింఛన్ల ఏరివేత ప్రక్రియను గుట్టుగా సాగిస్తున్నట్లు సమాచారం. అర్హత ఉన్న వారికి పింఛన్ల మంజూరులో ప్రభుత్వం తాత్సారం చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి ప్రభుత్వం ఉంటే ఈ పాటికి తమకు పింఛను వచ్చేసేదన్న అభిప్రాయం అందరిలోనూ ఏర్పడుతోంది. ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే అంశంగా చెప్పొచ్చు. పింఛన్ కోసం జనం గ్రామాల్లోని కూటమి నాయకులను పదేపదే కలుస్తున్నారు. నాయకులకు సైతం ఏంచెప్పాలో అర్థంగాక తలలుపట్టుకుంటున్నారు. కొత్త పింఛన్లు మంజూరు చేస్తే బాగుంటుందంటూ నాయకులు కోరుతున్నారు. జనవరిలో కొత్త పింఛన్లు ఇస్తారంటూ ప్రచారం సాగింది. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చిన ఊలుకూపలుకూ లేదు. పింఛను ఎదురుచూపులు ఎప్పటికి తీరతాయో చూడాల్సి ఉంది.





నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి హాజరైన ప్రతినిధులు, మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, డిఎన్‌విడి ప్రసాద్



నేడు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్

ఏలూరు జిల్లా కేంద్రంగా నామినేషన్ల స్వీకరణ

పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ

13న విత్‌డ్రాల పర్వం ముగిసాక పోటీ అభ్యర్థుల జాబితా వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. నోటిఫికేషన్ విడుదల నుంచి ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. గతంలో ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ కలెక్టర్ ఉండడంతో కాకినాడలోనే నామినేషన్ల ప్రక్రియ జరిగేది. ఈ సారి ఏలూరు జిల్లా కలెక్టర్‌ను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ అంతా ఏలూరు కలెక్టరేట్‌లో జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. పదో తేదీ వరకూ నామినేషన్ల ప్రక్రియ, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ విత్‌డ్రాల పర్వం కొనసాగనుంది. ఎన్నికల పోలింగ్ 27వ తేదీన జరగనుంది. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి టిడిపి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థిగా డివి.రాఘవులు ఖరారయ్యారు. వైసిపి నుంచి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదో తేలాల్సి ఉంది. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కొంతమంది పోటీలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలపై టిడిపి ప్రధానంగా దృష్టి సారించి ముందుకు సాగుతోంది. ఇటీవల సిఎం చంద్రబాబు సైతం ఆన్‌లైన్ సమావేశంలో ఆ పార్టీ నాయకులు దిశానిర్దేశం చేశారు. కూటమి నేతలను కలుపుకుని విజయానికి కృషి చేయాలంటూ తెలిపారు. అదే క్రమంలో పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డివి.రాఘవులకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, కార్పొరేట్ యజమానులు ఎంఎల్‌సిలుగా గెలిచినా ప్రజలకు పెద్దగా ఉపయోగపడిన పరిస్థితి గతంలో అందరూ చూశారు. పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలిచిన నాయకులు మాత్రం ప్రజలతో మమేకమవుతూ శాసనమండలిలోనూ, ప్రజలతో కలిసి పెద్దఎత్తున పోరాటాల్లో పాల్గొంటున్నారు. దీంతో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా కొనసాగే పరిస్థితి నెలకొంది.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ఆర్ఐఒ కె.చంద్రశేఖర్ బాబు





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

త్వరలో జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పబ్లిక్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు. ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు, ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో మొత్తం ఎన్ని ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి? ఎంతమంది పరీక్షలు రాయబోతున్నారు?

జిల్లాలో మొత్తం 137 ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 33, 511 మంది పరీక్షలు రాయబోతున్నారు.

ప్రశ్న : ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఎప్పటి నుంచి జరగనున్నాయి? ఎంత మంది ఈ ప్రాక్టికల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు?

ఫిబ్రవరి 5వ తేదీ నుంచి జిల్లాలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 29 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. 4,189 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

ప్రశ్న : జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? ఎన్ని కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు? ఎంతమంది విద్యార్థులు హాజరుకానున్నారు?

ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 66 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనుండగా 10,354 మంది హాజరుకానున్నారు.

ప్రశ్న : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? ఎంతమంది విద్యార్థులు హాజరుకానున్నారు?

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకూ జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 33,511 మంది పరీక్షకు హాజరుకానుండగా ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 18,453 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,058 మంది హాజరుకానున్నారు. మొత్తం విద్యార్థుల్లో 14,561 మంది బాలురు 18,950 మంది బాలికలు ఉన్నారు.

ప్రశ్న : ఇంటర్ పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఇంటర్మీడియట్, ప్రాక్టికల్ థియరీ పరీక్షలకు ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలు చేయడం జరుగుతుంది. అలాగే పరీక్షా కేంద్రాలను సెల్ఫన్ రహిత కేంద్రాలుగా ప్రకటించడం జరిగింది. సెల్‌ఫోన్‌తోపాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం జరగదు. అలాగే వైద్య సిబ్బందితో పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ కోఆర్డినేషన్ మీటింగ్‌లో విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించాం. అలాగే మారుమూల ప్రాంతాల విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా సకాలంలో ఆర్‌టిసి బస్సులు నడపాలని ఆదేశించాం. అలాగే పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్‌లో ఉత్తీర్ణతా శాతం పెంచడానికి 'సంకల్ప్' పేరుతో పని వేళలు పెంచడం జరిగింది. సెప్టెంబర్ నుంచి విద్యార్థులకు అదనపు స్టడీ అవర్స్ నిర్వహిస్తాం. వెనుకబడిన విద్యార్థులకు కేర్ టేకర్‌గా అధ్యాపకులను ఏర్పాటు చేసి, వారిపై వ్యక్తిగత శ్రద్ధ చూపించి, చదివించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.

నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల మూడో తేదీన జరగనుంది. ఏలూరు కార్పొరేషన్‌లో మొత్తం 50 మంది కార్పొరేటర్లు ఉండగా 47 మంది వైసిపి కార్పొరేటర్లు, ముగ్గురు టిడిపి కార్పొరేటర్లు గెలిచారు. నూతన ప్రభుత్వం ఏర్పడడంతో 27 మంది వైసిపి కార్పొరేటర్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.దీంతో టిడిపి బలం 30 మందికి చేరడంతోపాటు కార్పొరేషన్ మేయర్ పదవి నుంచి, డిప్యూటీ మేయర్, విప్, కో ఆప్షన్ పదవులు టిడిపి వశమయ్యాయి. దీంతో ఏలూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించడం జరుగుతుంది. టిడిపి తరపున పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గ భవానీ శ్రీనివాస్ పోటీ చేయనున్నారు. గతంలో వైసిపి తరపున నూకపెయి శ్రీనివాస్, గుడిదేశి శ్రీను డిప్యూటీ మేయర్‌గా పనిచేసి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరగనుంది.



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి మొండిచేయి

బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను అడియాసలు చేసిందని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య అన్నారు. మండలంలోని పూచిక గ్రామంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎపికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందని విమర్శించారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వీరంకి సుధాకర్, పడమటి వెంకన్నబాబు, జక్కుల వెంకటేష్, వీరంకి వీర్రాజు, స్వామిరాజు, రాము పాల్గొన్నారు.

క్లాప్ ఆటోలను కొనసాగించాలి

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు

నిలిపివేసిన క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) ఆటోలను కొనసాగించాలని, అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. స్థానిక పవర్ పేట సిఐటియు కార్యాలయంలో క్లాప్ ఆటోల డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షులు వి.రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఏలూరు నగర పాలక సంస్థలో గత మూడున్నరేళ్లుగా క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)పేరుతో ఇంటింటికి చెత్త సేకరించేందుకు 60 చెత్త సేకరణ ఆటోలను ప్రవేశపెట్టారన్నారు. ఈ చెత్త సేకరణ వాహనాలపై 60 మంది ఆటో డ్రైవర్లు గత మూడున్నరేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ క్లాప్ చెత్త సేకరణ వాహనాలను నిలిపివేసిందన్నారు. దీంతో 60 మంది డ్రైవర్లు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని చెప్పారు. నిలిపివేసిన క్లాప్ ఆటోలను కొనసాగించాలని, ఉద్యోగాలు కోల్పోయిన 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటోల వల్ల ఇంటింటికి చెత్త సేకరణ జరుగుతుందని, నగర పరిశుభ్రతకు క్లాప్ ఆటోల డ్రైవర్లు తక్కువ వేతనాలపై పనిచేస్తూ ఎంతో కృషి చేశారని చెప్పారు. అలాంటి క్లాప్ ఆటోలు నిలుపుదల చేయడం, ఇంటింటికి సేకరణ పనిని నిలిపివేయడం వల్ల దీనిని నమ్ముకుని జీవిస్తున్న డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా దారుణమని ఆయన విమర్శించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ క్లాప్ ఆటోల డ్రైవర్లు గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, వారిని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా తొలగించడం అన్యాయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల నాయకులు గణేష్, శ్రీను, కుమార్, ప్రేమ్, పుష్పరాజు, సుగుణరావు, నరేష్, రాము, జోషి తదితరులు పాల్గొని మాట్లాడారు. క్లాప్ ఆటోలను కొనసాగించాలని, అక్రమంగా తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ దశల వారీ ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో నగరపాలక సంస్థలో పని చేస్తున్న 60 మంది క్లాప్ ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.


పిల్లలపై దాష్టీకం

చిన్నారులకు మెరుగైన వైద్య సేవలందించాలి

జంగారెడ్డిగూడెం ఘటనపై కలెక్టర్ ఆగ్రహం



చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న డిఎస్‌పి



చిన్నారులతో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి - చింతలపూడి

పిల్లలపై కన్న తల్లి, ఆమె సహజీవనం చేస్తున్న వ్యక్తి దాడి చేసి ఇబ్బందులకు గురి చిత్రహింసలు పెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. సిఎన్ఆర్ మాల్ దగ్గర నివాసం ఉంటున్న శశి తన భర్తతో విభేదాల కారణంగా విడిపోయింది. శశి ఇద్దరు పిల్లలు ఆమెతో పాటే ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె పవన్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. శశి, పవన్ ఒకేచోట పిల్లలతో కలిసి ఉంటున్నారు. అయితే పవన్ తరచూ తాగి వచ్చి పిల్లలను విచక్షణారహితంగా కొడుతుండేవాడు. శనివారం రాత్రి సమయంలో పిల్లలను సెల్‌ఫోన్ ఛార్జర్ వైర్‌తో విచక్షణా రహితంగా కొట్టడంతో స్థానికులు ఆపి అతడిని పోలీసులకు అప్పగించారు. గాయపడిన పిల్లలిద్దరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పిల్లల తల్లి శశి మాట్లాడుతూ గత ఏడాది నుంచి పవన్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తున్నానని, తాను పనికి వెళ్లి వచ్చేసరికి పిల్లలను కొట్టేవాడని, రాత్రి సమయంలో అందరూ నిద్రిస్తూ ఉండగా పిల్లలను కొట్టడంతో పిల్లల అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి ఆపారని, తాగి ఉండడంతో పిల్లలు అల్లరి చేస్తున్నారని కొట్టాడని చెప్పింది. శశి, పవన్ కలిసి పిల్లలను చిత్రహింసలకు గురి చేస్తూ విశిక్షణారహితంగా కొడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

విషయం తెలుసుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి ఆసుపత్రి సిబ్బంది, ఐసిడిఎస్ అధికారులను వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది, ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణలో సంరక్షించాలని తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ డిఎస్‌పి రవిచంద్రను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలకు అందిస్తున్న వైద్య సేవలను జిల్లా డిసిహెచ్ఎస్ అధికారి డాక్టర్ పాల్ సతీష్ కుమార్ పరిశీలించారు.



ముదినేపల్లి సెంటర్‌లో దట్టంగా పొగ మంచు

పొగ మంచుతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పొగ మంచు ఆదివారం ముదినేపల్లి మండలాన్ని చాపల చుట్టేసింది. దట్టంగా మంచు రోడ్లను అలుముకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. మంచు, చలి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొగ మంచు మండలంలోని ప్రధాన రహదారులను, గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై దట్టంగా అలుముకుపోతుంది. ఈ కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారుజామున మొదలవుతున్న పొగ మంచు ఉదయం తొమ్మిది గంటల వరకు తగ్గటం లేదు. దీంతో వాహనచోదకులు, ప్రజలు దారి కనబడక అవస్థలు పడుతున్నారు. మంచు కారణంతో వాహన డ్రైవర్లు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లకు సరిగా దారి కనబడకపోవడంతో భారీ వాహనాలు, బస్సులు నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నాయి. మంచుతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మంచు ప్రభావంతో వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారు. మంచుకు చలి కూడా తోడవడంతో ప్రజలు ఇళ్ల నుంచి తొమ్మిది గంటలు దాటిన బయటికి రావడం లేదు. మంచు, చలి కారణంగా వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించరూ..!

ప్రభుత్వ కాలనీ వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో ప్రభుత్వ కాలనీ వాసులు వీధిదీపాలు, తాగునీటి సదుపాయం, డ్రెయినేజీ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు కనీసం సదుపాయాలు కల్పించకపోగా నిరుపేదలైన వారికి 33 కెవి కరెంట్ లైన్ కింద ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పటి వైసిపి ప్రభుత్వం విద్యుత్ తీగలు తొలగిస్తామని, మీరు ఇల్లు నిర్మించుకోండని అభయం ఇచ్చారు. దీంతో ప్రజలు బయట రూ.లక్షల్లో అప్పులు చేసి మరి ఫౌండేషన్ వేసి ఇంటి నిర్మాణం చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడు నెలలు కావస్తున్నా కొత్త ఇంటి నిధులు లేవు. ఇళ్ల నిర్మాణం లేవు. ఎప్పుడు ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితిలో పేదలు ఉన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతూ ఇంటి నిర్మాణం చేపట్టలేక అప్పులు తీర్చలేని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ వారు విద్యుత్ శాఖ వారు ఆ సమస్యను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కాలనీవాసులు, గ్రామప్రజలు కోరుతున్నారు.



ఇళ్లపై విద్యుత్ తీగలు

5న ఆర్ అండ్ ఆర్ సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్అండ్ఆర్ అధికారుల సమక్షంలో ఆర్అండ్ఆర్‌కు సంబంధించి అన్ని రకాల సమస్యలపై ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తహశీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

భీమడోలు రైల్వే గేటుకు మరమ్మతులు పూర్తి

రాకపోకలకు అనుమతి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు రైల్వే గేట్ వద్ద చేపట్టిన రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ఆదివారంతో పూర్తయ్యాయి. సాయంత్రం దాటిన తర్వాత రైల్వే అధికారులు రైల్వే గేట్ మీదుగా రాకపోకలకు అనుమతించారు. మరమ్మతు చేయాల్సిన పనులు అనుకున్న దానికన్నా ఎక్కువగా ఉండటంతో తొలుత ప్రకటించిన నిర్ణీత గడువులో పనులు పూర్తి కాలేదని, ఈ నేపథ్యంలో అనివార్యంగా మరమ్మతు పనులకు కేటాయించిన సమయాన్ని పెంచాల్సి వచ్చిందని రైల్వే అధికారులు వివరించారు.

సెలవు రోజుల్లో స్కూళ్లు నిర్వహించొద్దు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ డిమాండ్ చేశారు. చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న శ్రీ చైతన్య యాజమాన్యం వారు సెలవు దినాల్లో కూడా విద్యార్థులను మానసికంగా ఒత్తిడి చేస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న నారాయణ కళాశాల విద్యార్థి ఒత్తిడికి గురై మృతి చెందాడన్నారు. అయినా సెలవు దినం ఆదివారం రోజున చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న శ్రీ చైతన్య యాజమాన్యం వారు పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. తక్షణమే యాజమాన్యంపై ఎంఇఒ, డిఇఒ స్పందించి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కారు, ద్విచక్రవాహనం ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని దర్భగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నిర్వాసిత గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి జీలుగుమిల్లి వైపు నుంచి జంగారెడ్డిగూడెం వైపునకు బైక్‌పై వెళ్తుండగా దర్భగూడెం సమీపంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటు గా వెళ్తున్న పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు క్షతగాత్రుడిని చూసి ఆగి అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నవీన్‌కుమార్ క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పోలీస్ జీప్‌లో ఎక్కించి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఎస్ఐను ఎంఎల్ఎ అభినందించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తు తెలీని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఘటన వేమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ సమీపంలో గుర్తు తెలీయని వ్యక్తి రైలు బండి నుంచి జారి రైలు పట్టాలపై పడి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం అతని వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని, ఐదు అడుగుల ఆరు అంగుళాల ఎత్తు ఉన్నట్లు గుర్తించారు. నల్లటి జుట్టు కలిగి సాధారణ దేహదారుఢ్యం కలిగి ఉన్నాడని, తెలుపు రంగు పొట్టిచేతుల టీషర్ట్, నీలం రంగు నిక్కరు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని వద్ద ఎటువంటి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసినవారు రైల్వే ఎస్ఐ సైమన్ 9989219559 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఏలూరు రైల్వే పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముసునూరు గ్రామంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో మద్యం విక్రయిస్తున్న వీరంకి నాగరాజు వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.నాగప్రభు కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవిఎన్ఎస్.ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కోడిపందేలు, పేకాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిభిరంపై దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5300 నగదును, ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోణంగి గ్రామ శివారులో...

ఏలూరు స్పోర్ట్స్ : పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2900 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పొణంగి గ్రామ శివారులో పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ ఆదివారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2900 నగదుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

యథేచ్ఛగా నాటుసారా తయారీ, విక్రయాలు

ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నా మళ్లీ పరిస్థితి యధాతథం

కట్టడికి పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వాలు మారినా మండలంలోని పలు ప్రాంతాల్లో నాటు సారాను కట్టడి చేయడంలో విఫలమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోనే కాకుండా పక్క మండలంలోని చింతలపూడి ఏరియా మెట్ట ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఎక్కువగా నాటు సారా తయారు చేస్తూ ముసునూరు మండల పరిసర ప్రాంతాల్లో అమ్మకాలకు మొగ్గు చూపుతూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారు. అలాగే తమ్మిలేరు పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాల్లో కూడా ఎక్కువగా కొనసాగించడం పరిపాటిగా మారింది. గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖను ఏర్పాటు చేసి కట్టడి చేయాలని చూసినా చివరికి ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వం వేలం పాట ద్వారా ప్రయివేట్ దుకాణాలు ఏర్పాటు చేయగా నాటుసారా వల్ల మద్యం వ్యాపారానికి నష్టం వస్తుందని, ఎక్సైజ్ శాఖాధికారులతో సమీక్షలు జరిపి నెలలో పలు మార్లు దాడులు నిర్వహించినా నాటు సారా కట్టడి చేయలేకపోతున్నారు.

ప్రతిరోజు మండలంలో ఎక్కడోకక్కడ నాటు సారా స్థావరాలపై దాడులు చేస్తున్నా మళ్లీ పరిస్థితి షరామాములే. మండలంలోని 16 గ్రామాలతో పాటు వాటి శివారు గ్రామాలతో కలుపుకుని 20 గ్రామాల్లో నాటు సారా విచ్చలవిడిగా దొరుకుతుంది. ఈ నాటుసారా వల్ల వందలాది మంది బలవుతున్నారు. అందులో ముఖ్యంగా మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ఎక్కువగా దొరుకుతుంది. తమ్మిలేరు పరివాహక ప్రాంతాల్లో యువకులు నాటుసారాకు బానిస అయి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ప్రాణాలనూ సైతం కోల్పోతున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం నవోదయం వంటి కార్యక్రమాలు చేపట్టి సారాయి తగ్గుముఖం పట్టేలా చేసింది. మళ్లీ 2024లో టిడిపి ప్రభత్వం నవోదయం-2 అంటూ కార్యక్రమాన్ని పటిష్టపరిచి ఆయా గ్రామాల్లో ఉన్న అడవుల్లో, తమ్మిలేరులో, తోటల్లో, పొలాల్లో నాటుసారా స్థావరాలపై పలుమార్లు అధికారులు దాడులు చేసి ధ్వంసం చేసినా విక్రయదారులను, తయారీదారులను అరెస్టు చేసినా నాటుసారా కట్టడి కావడంలేదు. అంతేకాకుండా సారా తయారీకి ఉపయోగపడే నల్లబెల్లం నిషేధించారు. రోజువారి ఉపయోగించే బెల్లం వాడటంతో పాటు అమెనియం సల్ఫేట్‌ను ఎక్కువగా వాడుతున్నారని, దీంతో ఎక్కువగా సారా తాగేవారు చనిపోతున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖాధికారులు బెల్లం విక్రయ వ్యాపారుల గోడౌన్లలో తనిఖీలు నామమాత్రంగా చేయడం, అధికారులు దాడులు చేసే సమయానికి ముందుగా నాటుసారా వ్యాపారం చేసే వారికి సమాచారం వస్తుందని గ్రామాల్లో వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నాటు సారా కట్టడికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారికి తాత్కాలిక మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న యూనియన్ సభ్యులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు జాతీయ రహదారిపై కొన్ని నెలల క్రితం కురిసిన వర్షాలకు రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడటంతో రహదారి గుండా ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారికి మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవిచ్చుకున్నా స్పందించకపోవడంతో జీలుగుమిల్లి జగదాంబ ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులు ముందుకొచ్చి జెసిబి సహాయంతో రహదారిపై పడిన గోతులను చదును చేసి గోతుల్లో తారు అచ్చులు అతికించి తాత్కాలిక మరమ్మతులు చేశారు. అనంతరం రోడ్డుపై దుమ్ము లేగకుండా వాటర్ ట్యాంకర్లతో తడిపినట్లు తెలిపారు. అధికారులు చేయాల్సిన పనిని ఆటో యూనియన్ సభ్యులు చేయడంతో పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ గెడ్డం జనార్ధన్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, ట్రెజరర్ దారా మనోజ్‌కుమార్, సెక్రటరీ గుడ్ల రాంబాబు, జాయింట్ సెక్రటరీ నరసింహ, యామాల శ్రీను, సునీల్, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు బత్తిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే పాఠశాలలో పదో తరగతి (1978-79) విద్యనభ్యసించిన భీమవరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు బత్తిన వెంకటేశ్వరరావు తన పుట్టిన రోజును వైద్య శిబిరంలో జరుపుకున్నారు. నాటి సహచర విద్యార్థుల పర్యవేక్షణలో బిపి, షుగర్, ఇసిజి, హార్ట్ స్కానింగ్, కిడ్నీ, థైరాయిడ్, మలేరియా, డెంగీ వంటి తదితర పరీక్షలు నిర్వహించి, అక్కడే సంబధిత పత్రాలను అందించారు. శిబిరం వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. బత్తిన వెంకటేశ్వరరావుకు సంఘీభావంగా భీమవరానికి ప్రముఖ వైద్యులు రమణారావు, సుభాష్, నరేష్, వేణుగోపాలరాజు, లక్ష్మి, కెవి.త్రివేణి, నీలాద్రి రాజు, శ్రీవిద్య, హర్ష వర్మ, బాలకృష్ణరాజు, అశోక్ కుమార్ తదితర వైద్యులతో పాటు స్థానిక వైద్యులు అమీర్ సుల్తానా, ఎన్.దీప్తి, బి.శ్రీనివాస్, ఎ.ప్రశాంతి, ఎస్‌కె.మస్తాన్‌వలీ పాల్గొని రోగులకు ఉచిత వైద్య సేవలందించారు.



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తడి నేలలను సంరక్షించాలి



పక్షుల సంరక్షణ కేంద్రం వద్ద విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చెక్కపల్లి గ్రామంలో ఇకో క్లబ్ విద్యార్థులు కైకలూరు మండలం ఆటపాక పక్షుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. 1971లో జరిగిన ప్రపంచ దేశాల రాంసర్ ఒప్పందం ప్రకారం ప్రతి ఏడాది ఫిబ్రవరి రెండో తేదీన ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం జరుపుకుంటారని, జిల్లా ఉన్నతాధికారి బి.విజయ మాట్లాడుతూ చిత్తడి నేలల జీవ వైవిధ్యం పర్యావరణాన్ని కాపాడడంలో ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ఎన్నో జీవ రాశులకు, మొక్కలకు చిత్తడి నేలలు ఆవాసంగా ఉంటూ పర్యావరణ పరిరక్షణకు, సముద్ర తీర ప్రాంతంలో మాంగ్రూవ్ మొక్కల పెరుగుదలకు, పక్షుల పెరుగుదలకు తోడ్పడుతున్నాయన్నారు. చిత్తడి నేలలను అందరూ కాపాడుకోవాలని కోరారు. రేంజ్ ఆఫీసర్ రంజిత్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ రకాల పిలికాన్, ఫ్లామింగో, గూడ బాతు మొదలైన పక్షులను తిలకించారు. పక్షుల సంరక్షణ కేంద్రంలో ఉన్న మ్యూజియంలోని వివిధ రకాల పక్షుల జీవన విధానం తదితర అంశాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయ కర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎండి.అబ్బాస్, ఉపాధ్యాయులు పద్మ కిషోర్, పద్మలత, యోగిత, వింధ్య, కిరణ్మయి, వంద మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పోలవరం

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలవరం నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు గుబ్బా రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇళ్ల సత్యనారాయణ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేయించి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కత్తవ వెంకటేష్, చిక్కాల వెంకటేష్, జొన్నాడ సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా పనిచేస్తున్న శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి నెలవారీ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ పరిధిలోని 60 మంది వికలాంగులకు సన్నబియ్యం, పండ్లు, పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా అదే గ్రామానికి చెందిన దాట్ల అర్జునరాజు, శకుంతల దంపతులు వ్యవహరించారు. పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పేరేచర్ల సునీల్ వర్మ, శ్యామల రాజు, జి.శ్రీను, ఎ.సోములు పాల్గొన్నారు.

శరవేగంగా సీసీ డ్రెయిన్ల నిర్మాణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంబేద్కర్ కాలనీలో రెండు బజార్లలో డ్రెయిన్ నిర్మాణ పనులు అధికారులు చేపట్టారు. జెడ్‌పి నిధులు రూ.పది లక్షలు వెచ్చించి ఈ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం డ్రెయిన్ల నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. అంబేద్కర్ కాలనీవాసులకు సరైన డ్రెయినేజీ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీరు బయటికు పోయే మార్గం లేక ఇళ్ల ముందే నిలిచిపోతుంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేయడంతో కాలనీవాసులు రోగాలపాల వుతున్నారు. దీంతో కాలనీలోని రెండు బజారుల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం జరగడంతో కాలనీవాసులకు మురుగు సమస్య నుంచి విముక్తి లభించింది. డ్రెయిన్ల నిర్మాణంతో మురుగు సమస్యకు చెక్ పెట్టడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మాజీ సొసైటీ అధ్యక్షులు, వైసిపి నాయకులు కొల్లూరి రాంబాబు భార్య పద్మావతి వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని మహిళలకు సర్పంచి సున్నం ఉషారాణి చేతుల మీదుగా చీరలు, గాజులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల నలుమూలల నుంచి మహిళలు పెద్దఎత్తున పాల్గొని చీరలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, కంచర్ల సుధారాణి, నాయకులు కె.చౌదరరెడ్డి, ప్రకాశం, కన్నయ్య, సురేష్ పాల్గొన్నారు.

నగరంలో మహిళా రక్షక దళం పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాతో పట్టు ఏలూరు నగరంలో మహిళా రక్షక దళ సభ్యులు ప్రజల్లో తాము ఉన్నామన్న భరోసాను విస్తృతంగా కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం మహిళా రక్షక దళ సభ్యులు ఆయా ప్రాంతాల్లో విసిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. అంతేకాకుండా ఏలూరు నగరంలో పార్కులు రద్దీ ప్రాంతాలు బస్టాండ్లు రైల్వేస్టేషన్‌లో కూడలి ప్రాంతాల్లో వారు విసిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వీరు ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వృద్ధులు, మహిళలు అత్యవసర సమయాల్లో 112 నెంబర్‌కే కాకుండా 95550351100కు ఫోన్ చేసి ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు.


ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

రక్షణ కంచె లేని వైనం

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ గాలి వీచినప్పుడల్లా ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు రేగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా విద్యుత్ తీగలు తెగిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫారం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు ప్రమాద భరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌పార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాల్సి ఉన్న సంబంధిత అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లకు పక్కనే నడిచి వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీ ప్రధాన వీధితో పాటు చాలా చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు లేవు. ఆయా వీధుల్లో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. పైగా అవి తక్కువ ఎత్తులో ఉండటంతో చిన్నపిల్లలకు కూడా అందుతాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. చాలా చోట్ల అవి కిందకు వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు కూడా శిథిలావస్థకు చేరాయి. లోపల ఉన్న ఇనుప సువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. పలుచోట్ల రోడ్డు వెంట ఉన్న స్తంభాలకు వాహనాలు తగలటంతో అవి ఎప్పుడు పడిపోతాయోనని ప్రజలు ప్రయాందోళన కు గురవుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నూతన స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలి. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరి చేయడంతో పాటు ఇళ్లపై నుంచి వెళ్తున్న లైన్లను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎస్‌పి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి ఏలూరు స్పోర్ట్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంఎల్‌సి కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీస్ గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి 2025 ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ కార్యక్రమం రద్దయింది. ఈ నెల 27వ తేదీన ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. మార్చి మూడో తేదీన లెక్కింపు కార్యక్రమం మొదలవుతుంది. మార్చి ఎనిమిదో తేదీన ఈ ప్రక్రియ మొత్తంగా పూర్తవుతుంది. అప్పటివరకు పోలీస్ గ్రీవెన్స్ రద్దు చేయనున్నట్లు ఎస్‌పి తెలిపారు. దీనిని గమనించిన ఫిర్యాదుదారులు ఎస్‌పి కార్యాలయానికి రాకుండా ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లలోనే ఇచ్చే ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.